**అనుభవం లేని బుకీల కారణంగానే శ్రీశాంత్ తదితరులు దొరికిపోయారా? కొందరు జూనియర్ బుకీల అత్యాశే.. తాజా ఐపీఎల్ ఫిక్సింగ్ రాకెట్ బయటపడడానికి కారణమా? అంటే అవుననే అంటున్నారు తలపండిన బుకీలు.**

# అలా 'బుక్' అయ్యారు

**ముంబయి:** 'శ్రీశాంత్‌ను బంగారు పళ్లెంలో పెట్టి పోలీసులకు అప్పగించారు' - తాజా ఫిక్సింగ్ ఉదంతం బయటపడిన తర్వాత ఓ సీనియర్ బుకీ చేసిన వ్యాఖ్య ఇది. టవల్ పెట్టుకొని బౌలింగ్ చేయడం, వాచీ తిప్పి పెట్టుకోవడం లాంటి సంకేతాలతో ఫిక్సింగ్ రాకెట్ పనిచేయదని ఆ బుకీ చెప్పాడు. "ఫిక్సర్లతో ఆటగాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్‌లో మాట్లాడరు. ఇది ఫిక్సింగ్‌లో ప్రాథమిక సూత్రం. ఇంతకుముందు కూడా ఎంతో మంది బుకీలు మ్యాచ్‌లను ఫిక్స్ చేశారు. కానీ ఎవరూ ఇంత తెలివితక్కువగా వ్యవహరించలేదు" అని ఆ బుకీ చెప్పాడు. శ్రీశాంత్, దొరికిన ఇతర క్రికెటర్లు మొత్తం వ్యవహారంలో చిన్న పావులు మాత్రమేనని, కీలక వ్యక్తులు కాకపోవచ్చని ఆ బుకీ అభిప్రాయపడ్డాడు.. అసలు వ్యక్తులను పక్కనపెట్టి.. తామే ఎక్కువ లాభాలు సంపాదించేద్దామన్న కొందరు జూనియర్ బుకీల అత్యాశే శ్రీశాంత్ తదితరులు దొరికిపోవడానికి కారణమంటున్నాయి బెట్టింగ్ వర్గాలు. "ఇక్కడ వ్యాపారం నమ్మకంతో జరుగుతుంది. తేడా వస్తే ఫలితాలూ తేడాగానే ఉంటాయి. అంతర్గతంగా ఒక వ్యవస్థ పనిచేస్తోంది. అందులో భాగంగానే అందరూ పని చేయాలి. కాదని స్వతంత్రిస్తే.. మళ్లీ వ్యవస్థలోకి రాకుండా చేస్తారు. శ్రీశాంత్ విషయంలో కొందరు జూనియర్ బుకీలు వ్యవస్థకు దూరంగా స్వతంత్రంగా పనిచేయాలని భావించి ఉంటారు. అందుకే దొరికిపోయారు" అని ఆ వర్గాలు చెబుతున్నాయి. పోలీసులూ ఇదే మాట చెబుతున్నారు. "ఇదో వ్యవస్థీకృత నేర సామ్రాజ్యం. దీనికంటూ కొన్ని నిబంధనలుంటాయి. ఉల్లంఘిస్తే శిక్షలూ తీవ్రంగా ఉంటాయి. ఇక్కడ ఏదీ కాగితంపైన ఉండదు. ఎవరైనా డబ్బులు ఎగ్గొడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం కుదరదు. కానీ ఎవరూ ఎగ్గొట్టరు. ఎందుకంటే వారికీ తెలుసు తదనంతర పరిణామాలెంత తీవ్రంగా ఉంటాయో" అని ఓ పోలీస్ అధికారి చెప్పాడు.

**వాళ్లపై క్రిమినల్ కేసులు పెడతాం... బీసీసీఐ:** అరెస్టైన ముగ్గురి ఆటగాళ్ల(శ్రీశాంత్, అంకిత్ చవాన్, చండీలా)పై బీసీసీఐ తరఫున క్రిమినల్ కేసులు పెట్టే విషయాన్ని పరిశీలిస్తున్నామని బోర్డు అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసన్ అన్నాడు. ఫిక్సింగ్ సంఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, ఆ ముగ్గురికి ఎంత శిక్ష వేసినా సరిపోదన్నాడు.

**ఒవైస్ షాను విచారించనున్న ఇంగ్లాండ్:** ఫిక్సింగ్ కుంభకోణం నేపథ్యంలో రాజస్థాన్ కొనుగోలు చేసుకున్న ఇంగ్లిష్ ఆటగాడు ఒవైస్ షాను ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు చెందిన అవినీతి నిరోధక, భద్రత విభాగం(ఏసీఎస్‌యూ) విచారించనుంది. షా తప్పు చేసిన దాఖలాలు లేనప్పటికీ అతణ్ని విచారిస్తారని డెయిలీ టెలిగ్రాఫ్ పత్రిక తెలిపింది.




## నిద్రలేక..స్నానం చేయక

### పోలీసు కస్టడీలో శ్రీశాంత్ కష్టాలు

నిద్రపోయి రెండు రోజులైంది. స్నానం కూడా చేయలేదు. స్పాట్ ఫిక్సింగ్ కేసులో అరెస్టయిన శ్రీశాంత్ పరిస్థితిది! ఢిల్లీ పోలీసులు కస్టడీలో ఉన్న అతడు బాత్రూం సౌకర్యంగా అనిపించకపోవడంతో స్నానం చేయట్లేదు. చిన్న సెల్‌లో ఒంటరిగా, దిగులుగా ఉంటున్నాడు. శనివారం పోలీసుల రెండో దఫా విచారణ సందర్భంగా భోరున విలపించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. "తొలి రోజు సహచరులతో సెల్‌ను పంచుకున్నాడు. కానీ ఇప్పుడు అతడు ఒంటరి. గత రెండు రోజులుగా శ్రీశాంత్ నిద్ర పోవట్లేదు" అని ఓ పోలీసు అధికారి చెప్పాడు. "శనివారం మేం మళ్లీ ప్రశ్నించినప్పుడు అతడు భోరున విలపించాడు. చాలా దిగులుగా కనిపించాడు. ఒత్తిడిలో ఉన్నాడు. తరచుగా ఏడుస్తున్నాడు" అని తెలిపాడు. "మేం ప్రశ్నించనప్పుడు మామూలుగానే ఉంటున్నాడు. కొన్నిసార్లు నవ్వుతున్నాడు. తానెక్కడున్నాడన్న విషయం గుర్తొచ్చినప్పుడు వేదన చెందుతున్నాడు" అని చెప్పాడు.